సాక్షి
ఖమ్మం
ఆదివారం । 6 । అక్టోబర్ । 2024



సస్యరక్షణ చర్యలే కీలకం
మారుతున్న వాతావరణంతో పత్తి, వరి పంటలను చీడపీడలు ఆశించనున్నందున జాగ్రత్తలు పాటించాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. 8లో



మహిళలు రాణించాలి..
మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తూ ఆర్థికాభివృద్ధి సాధించాలని గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ అధికారులు సూచించారు. 8లో

గరిష్టం / కనిష్టం
34° / 23°

వాతావరణం
జిల్లాలో ఆదివారం గరిష్టస్థాయిలో ఉష్ణోగ్రత నమోదయ్యే అవకాశముంది. ఉదయం నుంచే ఎండ ప్రభావం మొదలవుతుంది.

న్యూస్‌రీల్

సహకార సంఘాన్ని బలోపేతం చేసుకోండి



ఉద్యోగులకు చెక్కులు అందిస్తున్న జిల్లా జడ్జి రాజగోపాల్

ఖమ్మంలీగల్: న్యాయశాఖ ఉద్యోగుల సహకార పరపతి సంఘాన్ని సమష్టిగా బలోపేతం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ సూచించారు. పరపతి సంఘానికి వచ్చిన లాభాల్లో సభ్యులకు వాటా చెక్కులను శనివారం అందించగా జిల్లా జడ్జి పాల్గొని మాట్లాడారు. ఇప్పటివరకు రూ.2 లక్షల మేర వ్యక్తిగత రుణాలు ఇస్తుండగా, మరింత బలోపేతమై రూ.5లక్షల వరకు రుణం మంజూరు చేయొచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. న్యాయశాఖ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రాజు, పరపతి సంఘం బాధ్యులు వెంకటేశ్వరరావు, ఉపేందర్‌రావు, జిల్లా కోర్టు ముఖ్య పరిపాలన అధికారి బి.హరికిష్ణ, నాజర్ కె.రాధేశ్యామ్ పాల్గొన్నారు.

ఆరు కోర్సులకే అవకాశం

ఖమ్మంసహకారనగర్: రాష్ట్రప్రభుత్వం ఐటీఐల్లో కొత్తగా ప్రవేశపెట్టిన ఆరు కోర్సుల్లో ప్రవేశానికి ఆరో దశ కౌన్సెలింగ్ ద్వారా అవకాశం కల్పించినట్లు ఐటీఐ కన్వీనర్, ఖమ్మం ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ఏ.శ్రీనివాసరావు తెలిపారు. ఇటీవల ఏటీసీలుగా అప్‌గ్రేడ్ అయిన ఐటీఐల్లో కొత్త కోర్సులకు అనుమతించగా, ఆసక్తి ఉన్నవారు ఈనెల 9వ తేదీ ఉదయం 11గంటల్లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్, ఆర్టిజన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్స్, బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైయర్(మెకానికల్), అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మిషనింగ్, మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికల్ కోర్సులకు http://iti.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా తగిన ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదు చేయించండి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మధుసూదన్

ఖమ్మం సహకారనగర్: వరంగల్ – ఖమ్మం – నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి జరగనున్న ఎన్నికల కోసం అర్హులైన వారితో ఓటర్లుగా నమోదు చేయించాలని అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్ సూచించారు. కలెక్టరేట్‌లో శనివారం విద్యాశాఖ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రభుత్వ ఉపాధ్యాయులంతా వచ్చే నెల 6లోగా ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదయ్యేలా అవగాహన కల్పించాలని సూచించారు. 2019లో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో జిల్లా నుండి 3,634 మంది ఉపాధ్యాయులు ఓటర్లుగా నమోదయ్యారని తెలిపారు. ఈసారి వీరితో పాటు కొత్త వారిని కూడా నమోదు చేయించాలని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవిబాబు, ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి



ఆందోళన చేస్తున్న టీపీటీఎఫ్ నాయకులు

ఖమ్మం సహకారనగర్: డీఎస్సీ–2024లో అర్హత సాధించిన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన శనివారంతో ముగిసింది. ఖమ్మంలోని రోటరీనగర్ హైస్కూల్‌లో మొత్తం 1,336మంది అభ్యర్థులు సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకున్నారని డీఈఓ సోమశేఖరశర్మ తెలిపారు. ఇందులో ఎస్ఏలు 475 మంది, ఎస్జీటీలు 790, లాంగ్వేజ్ పండిట్లు 46, పీడీ, పీఈటీలు 25మంది ఉన్నారని వెల్లడించారు. వీరి వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేస్తున్నట్లు తెలిపారు. కాగా, సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయిన అభ్యర్థులకు ఎకనాలెడ్జ్‌మెంట్ ఇవ్వాలనే డిమాండ్‌తో టీపీటీఎఫ్ ఆధ్వర్యాన ఆందోళన చేపట్టారు. సంఘం నాయకులు ఎస్.విజయ్, శ్యాంసుందర్, వెంగళరావు తదితరులు పాల్గొన్నారు.

41మంది గైర్హాజరు

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ ఓపెన్ స్కూల్ సప్లిమెంటరీ పరీక్షలకు శనివారం పదో తరగతి, ఇంటర్‌లో కలిపి 41మంది గైర్హాజరైనట్లు డీఈఓ సోమశేఖరశర్మ, ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు తెలిపారు. పదో తరగతి పరీక్షకు 93మందిలో 73మంది, ఇంటర్ పరీక్షకు 190మందిలో 169మంది హాజరయ్యారని వెల్లడించారు.

నిర్మాణం పూర్తయినా.. నేలకొండపల్లి మండలంలోని ఆచార్లగూడెంలో ఆరేళ్ల క్రితమే డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణం పూర్తయినా లబ్ధిదారులకు కేటాయించలేదు. 2018లో అప్పటి ప్రభుత్వం 18 ఇళ్ల నిర్మాణం చేపట్టింది. కానీ ఎవరికీ పంపిణీ చేయకపోవడంతో డబుల్ బెడ్ రూం ఇళ్ల మధ్య పిచ్చిచెట్లు, ముళ్ల పొదలు పెరిగి చిట్టడివిని తలపిస్తోంది. ఇళ్లు సిద్ధంగా ఉన్నందున అర్హత కలిగిన నిరుపేదలకు పంపిణీ చేయాలని స్థానికులు కోరుతున్నారు.



జిల్లాలో పథకం ఇలా...	మంజూరైన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు	టెండర్లు పిలిచినవి	నిర్మాణం పూర్తయినవి	లబ్ధిదారులకు అప్పగించిన ఇళ్లు
	8,956	7,229	5,933	5,529

డబుల్ వేగంతో...

- తొలి దశలో పూర్తయిన ఇళ్లు త్వరలో పంపిణీ
- ఆతర్వాత ఇందిరమ్మ పథకం అమలు
- జిల్లాలో సిద్ధంగా 404 గృహాలు
- లబ్ధిదారుల ఎంపికకు కొనసాగుతున్న సర్వే

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: గత ప్రభుత్వ హయాంలో నిర్మాణం పూర్తయినా లబ్ధిదారులకు పంపిణీ చేయని డబుల్ బెడ్ రూంఇళ్లలో దసరాకు ముందే గృహ ప్రవేశాలు చేయించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. వీటి పంపిణీ పూర్తయ్యాక ఇందిరమ్మ ఇళ్ల పథకానికి శ్రీకారం చుట్టనున్నట్లు తెలుస్తోంది. గత ప్రభుత్వ హయాంలో జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో 5,529 గృహాలను లబ్ధిదారులకు కేటాయించారు. ఇంకొన్ని నిర్మాణం పూర్తయినా పంపిణీ చేయకపోగా.. వివిధ దశల్లో పనులు ఆగిన వాటిపై అధికారులు దృష్టి సారించారు. సిద్ధంగా ఉన్న ఇళ్లను అర్హులకు కేటాయించాలని భావిస్తుండగా.. గుడిసెలు, రేకుల ఇళ్లలో ఎందరు నివస్తున్నారనే అంశంపై సర్వే చేయిస్తోంది.

లబ్ధిదారులకు 5,529 ఇళ్లు అప్పగింత

జిల్లావ్యాప్తంగా 8,956 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు మంజూరైతే 7,229 ఇళ్లకే టెండర్ పూర్తయింది. ఇందులో 5,933 పూర్తి కాగా.. మరో 911 నిర్మాణాలు పురోగతిలో ఉన్నాయి. పూర్తయిన వాటిలో 5,529 గృహాలను లబ్ధిదారులకు అప్పగించేశారు. ఖమ్మం నియోజకవర్గంలో అత్యధికంగా 2,083 ఇళ్లు లబ్ధిదారులకు అందజేశారు. ఈ నియోజకవర్గానికి 2,978 ఇళ్లు మంజూరు కాగా.. 2,867 నిర్మాణాలకు టెండర్లు పిలిచారు. వీటిలో 2,297 నిర్మాణాలు పూర్తి కాగా.. 474 పురోగతిలో ఉన్నాయి. పాలేరు నియోజకవర్గంలో 2,298 ఇళ్లు మంజూరు కాగా 1,012 ఇళ్లల్లో లబ్ధిదారులు ఉంటున్నారు. సత్తుపల్లిలో 1,340 ఇళ్లు మంజూరైతే 1,051 గృహాలను లబ్ధిదారులకు అప్పగించారు. మధిర నియోజకవర్గంలో 1,220 ఇళ్లకు గాను 789, వైరా నియోజకవర్గంలో 840 గృహాలకు 374, ఇల్లెందు నియోజకవర్గానికి సంబంధించి కామేపల్లి మండలంలో 280 ఇళ్లు మంజూరు కాగా 220 గృహాలు పంపిణీ చేశారు. మొత్తంగా 5,933 ఇళ్లలో 5,529 ఇళ్లు మాత్రమే అప్పగించడంతో ఇంకా 404 గృహాలు సిద్ధంగా ఉన్నాయి.

ఇంకొంత పనిచేస్తే...

కొంత మేర పనులు చేపడితే అర్ధంతరంగా ఆగిపోయిన 911 ఇళ్ల నిర్మాణం పూర్తవుతుందని అంచనా. పిల్లర్లు సిద్ధం ఉన్నవి, స్లాబ్ వేసినా గోడలు కట్టనివి, అంతా పూర్తయినా విద్యుత్ కనెక్షన్ ఇవ్వనివి ఈ జాబితాలో ఉండగా వాటి స్థితిగతులను తహసీల్దార్లు పరిశీలిస్తున్నారు. ఈమేరకు సిద్ధంగా ఉన్నవే కాక చిన్నచిన్న పనులు చేపడితే ఇల్లు సిద్ధమయ్యే గణాంకాలు తీసి అర్హులకు అందించనున్నట్లు తెలుస్తోంది. మళ్లీ కొత్తగా అర్హులను గుర్తించాలంటే సమయం పట్టనున్నందున రెండేళ్ల క్రితం రూపొందించిన జాబితా ఆధారంగా లాటరీ ద్వారా ఇళ్లు అప్పగించే అవకాశముంది.

ఆ తర్వాతే 'ఇందిరమ్మ'

డబుల్ బెడ్ రూం ఇళ్లను పూర్తిస్థాయిలో లబ్ధిదారులకు పంపిణీ చేశాక ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, పంపిణీపై దృష్టి సారించనున్నారు. ఇందుకోసం గుడిసెల్లో ఉంటున్న వారు, బీపీఎల్ పరిధిలోకి వచ్చే వారి వివరాలను అధికారులు సర్వే ద్వారా తెలుసుకున్నారు. మరోమారు సర్వే చేసి మొత్తం ఇళ్లు లేని వారు ఎందరు, గుడిసెల్లో ఉంటున్న వారు ఎందరో గుర్తించి ఇందిరమ్మ పథకం ద్వారా కొత్త ఇళ్లు నిర్మించనున్నారు. ఇక స్థలం ఉండి ఇల్లు లేని వారికి నిర్మాణం కోసం రూ.5 లక్షలు మంజూరు చేస్తారు. స్థలం కూడా లేని వారికి ప్రభుత్వ భూమిలో ప్లాట్ కేటాయిస్తారు. అయితే, దీనికి సంబంధించి ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు విడుదల కావాల్సి ఉంది.

తొలుత వరద బాధితులకు..

చాన్నాళ్ల క్రితం నిర్మాణం పూర్తయిన 404 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను వివిధ కారణాలతో లబ్ధిదారులకు పంపిణీ చేయలేదు. లబ్ధిదారులు అర్హులు కాదని, ఆ కుటుంబానికి గతంలో ఇల్లు దక్కిందని ఇలా రకరకాల కారణాలతో ప్రక్రియ ముందుకు సాగలేదు. అయితే, ఇటీవల మున్నేటి వరదతో ఖమ్మంరూరల్, ఖమ్మం నగరంలోని పలువురి ఇళ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. దీంతో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి అనుమతి తీసుకుని వరదల్లో పూర్తిగా ఇళ్లు కొట్టుకుపోయిన 30 కుటుంబాలకు ఈ గృహాలు కేటాయించనున్నట్లు తెలిసింది.

ఆయిల్‌పామ్ సాగు లాభదాయకం

- రైతులు ధైర్యంగా సాగు చేయండి
- రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి తుమ్మల, పక్కన ప్రజాప్రతినిధులు, అధికారులు

రఘునాథపాలెం: రైతులు లాభదాయకమైన ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించాలని తద్వారా ఆర్థికంగా ఎదగొచ్చని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రఘునాథపాలెం మండలంలోని కోటపాడు, వీ.ఆర్.బంజర, జీ.కే.బంజర, పాపటపల్లి, చిమ్మపూడి గ్రామాల్లో శనివారం పర్యటించిన ఆయన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగుచేస్తూనే మిర్చి అంతర్ పంటగా పండించొచ్చని తెలిపారు. అతి త్వరలోనే ఎత్తిపోతల పథకం ద్వారా మండలంలోని అన్ని గ్రామాలకు సాగర్ నీళ్లు తీసుకొచ్చే బాధ్యతను తాను తీసుకుంటానని చెప్పారు. రైతులు ధైర్యంగా ఆయిల్‌పామ్ సాగుకు ముందుకు రావాలని సూచించారు.

త్వరలోనే రుణమాఫీ, రైతుభరోసా

రూ.2 లక్షలకు పైగా పంట రుణాల విషయమై త్వరలో షెడ్యూల్ ప్రకటిస్తామని మంత్రి తుమ్మల వెల్లడించారు. అంతేకాక రైతు భరోసా, ప్రీమియం ప్రభుత్వమే చెల్లిస్తూ పంటల బీమా కూడా అమలుచేస్తామని చెప్పారు. రైతులకు సంబంధించి సంక్షేమ పథకాలన్నీ ప్రాధాన్యతా క్రమంలో ప్రారంభిస్తున్నామని తెలిపారు. కాగా, మండలంలో స్థలం ఉండి ఇళ్లు లేని పేదల జాబితా ఫొటోలతో సహా రూపొందించాలని అధికారులకు సూచించారు. అలాగే, పెండింగ్ ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్ల పనులు త్వరగా పూర్తిచేసి సంక్రాంతి నాటికి లబ్ధిదారులకు అందజేయాలని మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ ఈఈలు వెంకట్‌రెడ్డి, యుగంధర్, తహసీల్దార్ లూథర్ విల్సన్, ఎంపీడీఓ అశోక్, ఎంపీఓ శ్రీనివాస్‌రెడ్డి, పీఆర్ డీఈ మహేష్, ఏఈ చిరంజీవి, ఏఓ ఉమామహేశ్వరరెడ్డితో పాటు గౌరి, బాలాజీ, పూర్ణ, లాలు, తదితరులు పాల్గొన్నారు.



హలో.. ఖమ్మం!

జిల్లాకేంద్రంలోని వైరా రోడ్డులో జీవీ మాల్ నూతన షోరూంను శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సినీ హీరోయిన్ కీర్తి సురేష్ సందడి చేశారు. పెద్దసంఖ్యలో హాజరైన అభిమానులను ఉద్దేశించి మాట్లాడిన ఆమె పలువురితో సెల్ఫీలు దిగారు. తొలిసారి ఖమ్మం వచ్చిన తనకు లభించిన ఆదరణ ఆనందాన్ని ఇచ్చిందని తెలిపారు.

రామయ్యను దర్శించుకున్న ప్రిన్సిపల్ సెక్రటరీ



రామాలయంలో సంజయ్‌కుమార్ తదితరులు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారిని తెలంగాణ ఎంప్లాయ్‌మెంట్, ట్రెనింగ్ ఫ్యాక్టరీస్ ప్రిన్సిపల్ సెక్రటరీ సంజయ్‌కుమార్ కుటుంబసమేతంగా శనివారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికి వేదాశీర్వచనం చేశారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం సంజయ్‌కుమార్ కుటుంబసభ్యులు మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ అధికారులు ఆయనకు స్వామివారి జ్ఞాపికతో పాటు ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సాయిబాబు, ఐటీసీ అధికారులు చెంగలరావు పాల్గొన్నారు.

శ్రీగాయత్రీదేవి రూపంలో అమ్మవారు



గాయత్రీదేవి రూపంలో పూజలు అందుకున్న అమ్మవారు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవోపేతంగా కొనసాగుతున్నాయి. ఈమేరకు మూడో రోజైన శనివారం తెల్లవారుజామున శ్రీవారికి అర్చకులు పంచామృతంతో అభిషేకం నిర్వహించారు. అనంతరం యాగశాలలో శ్రీవారు, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాల వద్ద పూజలు చేశాక శ్రీ అలివేలు మంగ అమ్మవారిని గాయత్రీదేవి రూపంలో అలంకరించడంతో పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆతర్వాత భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు. ఆలయ ఈఓ కె.జగన్మోహన్‌రావు, చైర్మన్ ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, అర్చకులు ఉప్పల మురళీమోహన్‌శర్మ, రాజీవ్‌శర్మ, సూపరింటెండెంట్ విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీలో బతుకమ్మ సంబురం

ఆడిపాడిన సీఈఓ రైనా, ఉద్యోగులు

ఖమ్మంవన్‌టౌన్: జిల్లా పరిషత్ కార్యాలయంలో శనివారం సాయంత్రం బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహిళా ఉద్యోగులంతా బతుకమ్మలతో చేరుకుని ఆటపాటలతో అలరించారు. జెడ్పీ సీఈఓ దీక్షారైనా, డిప్యూటీ సీఈఓ నాగలక్ష్మి సైతం బతుకమ్మలతో వచ్చి ఉద్యోగులతో సంబురాల్లో పాలుపంచుకున్నారు. ఈ సందర్భంగా సీఈఓ రైనా మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా ప్రభుత్వం వేడుకలు నిర్వహిస్తోందని తెలిపారు. పూలను ప్రేమించి, పూజించే పండుగ బతుకమ్మ మాత్రమేనని చెప్పారు. జిల్లా పరిషత్ ఉద్యోగులు జ్యోతి, మంగమ్మ, గంగా భవాని, విజయలక్ష్మి, ఝాన్సీ, వాణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.



బతుకమ్మలతో వస్తున్న జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, ఉద్యోగులు

ఎవరి పాత్ర ఏమిటి.. ఎంత?

సీఎంఆర్ పక్కదారిపై వేగంగా విచారణ

సాక్షిప్రతినిధి, ఖమ్మం: జిల్లాలో రూ.200 కోట్ల విలువైన సీఎంఆర్(కస్టమ్ మిల్లింగ్ రైస్) పక్కదారి పట్టడం.. ఈ వ్యవహారంలో మిల్లర్ల పాత్రకు తోడు పౌర సరఫరాల సంస్థ అధికారులపై వచ్చిన ఆరోపణల నేపథ్యాన నాలుగు రోజులుగా విచారణ కొనసాగుతోంది. ఈ వ్యవహారంలో ఎవరి పాత్ర ఎంత మేర ఉందనే అంశంపై అదనపు కలెక్టర్ శ్రీజ పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్నారు. పౌర సరఫరాల సంస్థలోని అధికారులు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, మిల్లులను పర్యవేక్షించే డిప్యూటీ తహసీల్దార్లు ఒక్కొక్కరి నుంచి ఆమె వివరాలు ఆరా తీస్తున్నట్లు తెలిసింది. దీంతో ఎవరి మెడకు చుట్టుకుంటుందోనని సంస్థ అధికారులు, ఉద్యోగులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. సీఎంఆర్ కేటాయింపులు, ఆ తర్వాత పర్యవేక్షణ, ప్రభుత్వానికి రావాల్సిన బియ్యం సమయానికి అందకపోవడానికి కారణాలను అదనపు కలెక్టర్ సమగ్రంగా తెలుసుకుంటూ నివేదిక రూపొందిస్తున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంలో ఎవరు ఉన్నా ఉపేక్షించేది లేదని ఇప్పటికే ముగ్గురు మంత్రులు ప్రకటించడంతో బాధ్యులపై కఠిన చర్యలు తప్పవనే ప్రచారం జరుగుతోంది.

సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకోండి

ఖమ్మం సహకారనగర్: భారీ వర్షాలతో ఇళ్లలోకి నీరు చేరగా ఇంటర్మీడియట్ సర్టిఫికెట్లు కోల్పోయిన వారికి ఎలాంటి రుసుం లేకుండా కొత్త సర్టిఫికెట్లు ఇవ్వాలని బోర్డు నిర్ణయించిందని డీఐఈఓ రవిబాబు తెలిపారు. అభ్యర్థులు tsbie.cgg. gov.in వెబ్‌సైట్‌లో విద్యార్థి ఆన్‌లైన్ సర్వీసెస్ విభాగంలో ఉన్న లింక్ ద్వారా సెల్ఫ్ డిక్లరేషన్, ప్రిన్సిపాల్ డిక్లరేషన్ అప్‌లోడ్ చేసి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాల కోసం కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో సంప్రదించాలని డీఐఈఓ తెలిపారు.

రైతులకు కేంద్రం పెట్టుబడి సాయం

ఖమ్మంవ్యవసాయం: కిసాన్ సమ్మాన్ యోజన 18వ విడత నగదును కేంద్రప్రభుత్వం శనివారం రైతుల ఖాతాల్లో జమ చేసింది. 2019నుంచి ఈ పథకం అమలవుతోంది. ఐదెకరాల లోపు భూమి కలిగిన రైతులకు పంట పెట్టుబడిగా రూ.2వేల చొప్పున ఏటా మూడు సార్లు కేంద్రం విడుదల చేస్తుంది. ప్రస్తుతం వానాకాలం సీజన్ పెట్టుబడి సాయంగా జిల్లాలోని సుమారు 1.10లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.2 వేల చొప్పున జమ చేసింది.

జిల్లాకు చేరని రేషన్ బియ్యం

ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని పలు రేషన్ దుకాణాల్లో ఈనెల బియ్యం సరఫరా కాలేదు. జిల్లాలో 748 రేషన్ దుకాణాలు ఉండగా సుమారు 400 దుకాణాలకు కొద్దిమొత్తంలో మాత్రమే బియ్యం చేరింది. దీంతో అంత వరకు బియ్యం పంపిణీ చేయగా మిగతా షాపుల పరిధిలో అసలు మొదలే కాలేదు. ఇప్పటికే 5వ తేదీ దాటగా, అధికారులు స్పష్టత ఇవ్వడం లేదని.. బియ్యం పంపిణీ తేదీని పొడిగిస్తారా అన్నది కూడా తెలియడం లేదని డీలర్లు చెబుతున్నారు.

క్లుప్తంగా

ఖో-ఖో పోటీల్లో రాష్ట్ర జట్టుకు ద్వితీయ స్థానం

- జట్టు కోచ్‌గా వ్యవహరించిన సత్తుపల్లి పీడీ శ్రీదేవి



జట్టు క్రీడాకారులతో పీడీ శ్రీదేవి

సత్తుపల్లిరూరల్: జాతీయస్థాయి సబ్‌జూనియర్ ఖో-ఖో పోటీల్లో తెలంగాణ జట్టు ద్వితీయస్థానం సాధించింది. జార్ఖండ్ రాష్ట్రంలోని సిండేగా జిల్లాలో గత నెల 28వ తేదీ నుంచి ఈ నెల 2వ తేదీ వరకు 34వ జాతీయ సబ్‌జూనియర్ ఖో-ఖో పోటీలు నిర్వహించారు. ఈ మేరకు రాష్ట్ర జట్టును సత్తుపల్లి బాలికల పాఠశాల పీడీ చీకటి శ్రీదేవి కోచ్‌గా ముందుకు నడిపించారు. అంతేకాక తన కుమార్తె యోజిత జ్ఞాపకార్థం క్రీడాకారులకు నగదు బహుమతి అందించారు. ఈ సందర్భంగా పీడీ శ్రీదేవిని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, హెచ్‌ఎం నాగేశ్వరరావు, ఎంఈఓ రాజేశ్వరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

జిల్లా ఫుట్‌బాల్ జట్టు ఎంపిక



జిల్లా అండర్ -17 ఫుట్‌బాల్ జట్టు

ఖమ్మంస్పోర్ట్స్: అండర్-18 విభాగం రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు గాను జిల్లా పాఠశాలల క్రీడా సంఘం ఆధ్వర్యాన జిల్లాస్థాయి ఫుట్‌బాల్ బాలికల జట్టును ఎంపిక చేశారు. ఈ మేరకు జట్టు రాష్ట్రస్థాయి పోటీలకు శనివారం బయలుదేరింది. కాగా, జట్టు సభ్యులకు జెర్సీలు ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యాన అందించగా జిల్లా పాఠశాలల క్రీడల కార్యదర్శి కె.నర్సింహమూర్తి, అసోసియేషన్ కార్యదర్శి కె.ఆదర్శ్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా జపమాల మాత ఉత్సవం



దివ్యబలి పూజ సమర్పిస్తున్న ప్రదీప్‌రెడ్డి

వైరా: వైరాలోని ఆర్‌సీఎం చర్చి ఆధ్వర్యాన శనివారం జపమాల మాత ఉత్సవాన్ని నిర్వహించారు. చర్చి ఫాదర్ ఆరుల్ ప్రకాశం నేతృత్వాన జరిగిన ఉత్సవంలో డాన్ బోస్కో ప్రిన్సిపాల్ ప్రదీప్‌రెడ్డి దివ్యబలి పూజ సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడగా భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. చర్చి ఫాదర్లు రవికుమార్, అంథోని, జోజప్ప, దావీదు, యేసు తదితరులు పాల్గొన్నారు.

నేడు 'కథ-2023' పుస్తకం ఆవిష్కరణ

ఖమ్మంగాంధీచౌక్: ఉత్తమ కథా సాహితీ సంకలనాలను 34 ఏళ్లుగా పాఠకులకు అందిస్తున్న జాషువా సాహిత్య వేదిక - ఖమ్మం ఆధ్వర్యాన ఈ ఏడాది 'కథ - 2023' పుస్తకాన్ని సిద్ధం చేయగా ఆదివారం ఆవిష్కరించనున్నట్లు వేదిక బాధ్యులు తెలిపారు. ఖమ్మం జెడ్పీ సమావేశ మందిరంలో కవి, విద్యావేత్త పి.రవి మారుత్ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ కె.శ్రీనివాస్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తారని వెల్లడించారు. కాగా, ఈ పుస్తకాన్ని తానా చేయూతతో తక్కువ ధరకే పాఠకులకు అందించనున్నామని తెలిపారు.

ఆర్టీసీ లాజిస్టిక్ సేవల విస్తరణ

ఖమ్మంమయూరిసెంటర్: ఉమ్మడి జిల్లాలో ఇప్పటివరకు బస్టాండ్లకే పరిమితమైన లాజిస్టిక్ సేవలను మండల, గ్రామీణ ప్రాంతాలకు విస్తరించినట్లు లాజిస్టిక్స్ ఏటీఎం ఎ.పవన్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ లాజిస్టిక్స్ ద్వారా తక్కువ ధరతో వేగంగా, భద్రంగా పార్శిళ్లు పంపించే వెసలుబాటు లభిస్తుందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలోనే కాక ఏపీలోని అన్ని ముఖ్యమైన పట్టణాలు, కర్ణాటకలోని బెంగళూరులో కూడా లాజిస్టిక్ సౌకర్యం అందుబాటులో ఉందని తెలిపారు. ప్రస్తుతం బస్టాండ్లకు తోడు ఇతర ప్రాంతాల్లో కలిపి ఉమ్మడి జిల్లాలో 35 లాజిస్టిక్ కేంద్రాలు ఏర్పాటయ్యాయని వివరించారు.

యువకుడి మృతదేహం లభ్యం

ఖమ్మంరూరల్: మండలంలోని ప్రకాష్‌నగర్ వద్ద మున్నేటి బ్రిడ్జి సమీపాన గుర్తు తెలియని యువకుడి (30) మృతదేహం శనివారం లభ్యమైంది. విషయం తెలుసుకున్న పోలీసులు చేరుకుని అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు సాయంతో మృతదేహాన్ని బయటకు తీయించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి మృతుడి ఆచూకీ తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నామని సీఐ ముష్క రాజు తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.17,043

వరి, పత్తిలో సస్యరక్షణ చర్యలే కీలకం



వరి పొలం

- ప్రస్తుత పరిస్థితుల్లో చీడపీడలు ఆశించే అవకాశం
- రైతులు అప్రమత్తంగా ఉండాలని శాస్త్రవేత్తల సూచనలు

మధిర: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వరి, పత్తి పంటల్లో చీడపీడలు ఆశిస్తున్నట్లు తెలుస్తోందని మధిర వ్యవసాయ పరిశోధనా సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె.రుక్మిణీదేవి తెలిపారు. రైతులు అప్రమత్తంగా ఉంటూ నిరంతరం పంట పొలాల్లో పరిశీలిస్తూ తెగుళ్లను గుర్తించి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ మేరకు డాక్టర్ కె.రుక్మిణీదేవి చేసిన సూచనలు ఇలా ఉన్నాయి.

వరిలో సుడిదోమ

వరి పంట దుబ్బు చేసే దశ, అంకురం తొడిగే దశలో ఎకరాకు 30 కిలోల నుంచి 35 కిలోల యూరియా, 15 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేయాలని సూచించారు. వరిపంటను సుడిదోమ ఆశించే అవకాశం ఉన్నందున పిలక దశలో దుబ్బుకి 10 నుంచి 15 దోమలు, అంకురం నుంచి ఈనిన దశలో దుబ్బుకు 20 నుంచి 25 దోమలు ఉంటే తొలిదశలో ఎసిఫేట్ 1.5 గ్రాములను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. దోమ ఉధృతి ఎక్కువగా ఉంటే డైనోటిప్యూరాన్ 20 ఎస్‌జీ 0.4 గ్రాములు లేదా పైమెటోజైన్ 50 డబ్ల్యూజీ 0.6 గ్రాములు లేదా ట్రైఫ్లూమెజోపైరిమ్ 0.485 మి.లీ. లేదా ఇమిడాక్లోప్రిడ్ 40 శాతంతోపాటు విథిప్రోల్ డబ్ల్యూజీ 0.25 గ్రాములను లీటర్ నీటిలో కలిపి మొక్కల మొదళ్ల మీద పడేలా పిచికారీ చేయాలని తెలిపారు. ఇక అగ్గితెగులు సోకితే తొలిదశలో గుర్తించి వెసోప్రోథయోలేన్ 1.5 మి.లీ. లేదా ట్రైసైక్లోజోల్ 0.6 గ్రాములు లేదా కాసుగామోసిన్ 2.5 మి.లీ. లేదా ట్రైసైక్లోజోల్‌తోపాటు మ్యాంకోజెబ్ 2.5 గ్రాములను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు.

పూత, కాత దశలో పత్తి

పత్తి పూత, కాత, కాయ దశలో ఉందని.. నేలలో అధిక తేమ లేదా బెట్ట పరిస్థితుల్లో పూత, కాత రాలిపోతోందని గుర్తించారు. పూత, కాత, కాయ రాలడం ఎక్కువగా ఉంటే ప్లానోఫిక్స్ 1 మి.లీ. మందును ఐదు లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. యూరియా, పొటాష్ ఎరువును పత్తి పంట 80, 90 రోజుల దశ వరకే వాడాలన్నారు. పత్తి మొక్క ఎదుగుదల తక్కువగా ఉంటే పైపాటుగా లీటర్ నీటికి 10 గ్రాముల చొప్పున 13:0:45 లేదా 19:19:19 (పాలీఫీడ్) లేదా యూరియా 20 గ్రాములు పురుగు లేదా తెగులు మందులను పిచికారీ చేసేటప్పుడు కలుపుకుని పిచికారీ చేయాలన్నారు. తామర, పేనుబంక, పచ్చదోమ నివారణకు ఎసిఫేట్ 1.5 గ్రాములు లేదా ఎసిటామిప్రిడ్ 0.2 గ్రాములు థయోమిథాక్సామ్ 0.2 గ్రాములు, ఫ్లోనికామెడ్ 0.3 గ్రాములు లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.25 మి.లీ. లేదా డైఫెన్‌థయూరాన్ 1.25 గ్రాములు, సూవినోటోరమ్ 0.9 మి.లీ.ను లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. తలమాడ తెగులు పత్తిలో ఆశించినట్లు గమనిస్తే తామర పురుగులు ఈ తెగులు వ్యాప్తికి దోహదపడతాయని పేర్కొన్నారు. అంతేకాక వయ్యారిభామ కలుపు మొక్కలు తీసివేయాలని సూచించారు. తామరపురుగు నివారణకు ఫిప్రోనిల్ 2 మిల్లీలీటర్లు లేదా థయోమిథాక్సామ్ 0.2 గ్రాములు కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. గులాబీరంగు పురుగు నివారణకు పంట పూత దశ నుంచి 4 నుంచి 8 లింగాకర్షక బుట్టలు ఎకరాకు పెట్టుకోవాలని తెలిపారు. గడ్డిపూలను ఏరివేయాలని, మొదటగా ప్రొఫికోఫాస్ 2 మిల్లీ లీటర్లు, వేపనూనె 5 మి.లీ.ను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని వివరించారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

చింతకాని: మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ ఆర్థికాభివృద్ధి సాధిస్తే భవిష్యత్ తరాలు బాగుపడతాయని గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ డైరెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. చింతకానిలోని ఐకేపీ కార్యాలయంలో విజయభారతి మహిళా మండలి, ఎస్‌బీఐ - గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యాన మహిళలకు మగ్గం వర్క్ శిక్షణ ఇస్తున్నారు. ఈ శిబిరాన్ని శనివారం పరిశీలించిన చంద్రశేఖర్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేలా ఎస్‌బీఐ, గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యాన శిక్షణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం స్వచ్ఛ భారత్ నిర్వహించారు. కోర్సు కోఆర్డినేటర్ వహీద్, విజయభారతి మహిళా మండలి అధ్యక్షురాలు విజయలక్ష్మితో పాటు నరేశ్, స్వరూప తదితరులు పాల్గొన్నారు.



మగ్గం వర్క్ శిక్షణను పరిశీలిస్తున్న డైరెక్టర్, తదితరులు

రేపు వామపక్షాల ఆధ్వర్యాన నిరసన

ఖమ్మంమయూరిసెంటర్: ఇజ్రాయిల్ పాలస్తీనాపై జరుపుతున్న దాడులకు నిరసనగా సోమవారం ఖమ్మంలో నిరసన ప్రదర్శన నిర్వహించనున్నట్లు వామపక్షాల నాయకులు వెల్లడించారు. వామపక్ష పార్టీల సంయుక్త సమావేశం ఖమ్మం గిరిప్రసాద్‌భవన్‌లో శనివారం జరిగింది. ఈ సందర్భంగా సోమవారం పాత కలెక్టరేట్ ఎదురుగా ఉన్న చాకలి ఐలమ్మ విగ్రహం నుంచి జెడ్పీ సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించాలని నిర్ణయించారు. సమావేశంలో సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు పోటు ప్రసాద్, నున్నా నాగేశ్వరరావు, మాస్‌లైన్, న్యూడెమోక్రసీ, సీపీఐ, సీపీఎం నాయకులు ఆవుల వెంకటేశ్వర్లు, రాజేంద్రప్రసాద్, తాటి వెంకటేశ్వరరావు, రావి శివరామకృష్ణ, వై.విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న వామపక్ష పార్టీల నాయకులు

అమ్ముకున్న భూమిని తిరిగి ఆక్రమించే యత్నం?

రఘునాథపాలెం: పదిహేనేళ్ల కిందట తాము కొనుగోలు చేసిన ప్లాట్లను ఆక్రమించేందుకు యత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరారు. రఘునాథపాలెం వద్ద భూమిని ఆక్రమించేందుకు వచ్చిన వారిని శనివారం సాయంత్రం అడ్డుకున్న వారు వివరాలను వెల్లడించారు. ఖమ్మం అర్బన్ పరిధి మల్లెమడుగు రెవెన్యూలో డి.కృష్ణారావు, సీహెచ్.రాములు, హన్మంతరావు 2007 - 2008లో వెంచర్ చేయగా పలువురు ప్లాట్లు కొనుగోలు చేశారు. ఇందులో కొందరు ఎల్‌ఆర్‌ఎస్ కూడా చేయించుకున్నారు. అయితే, భూమి మొదటి పట్టాదారుడి మనమడు రెవెన్యూలో లొసుగుల ఆధారంగా భూమిని ఆయన పేరిట మార్చుకోగా ప్లాట్లు కొనుగోలు చేసిన 33 మంది కోర్టు నుంచి ఇంజక్షన్ ఆర్డర్ పొందారు. అయినప్పటికీ ఆయన భూఆక్రమణకు శనివారం ఫెన్సింగ్ వేయిస్తుండగా వారంతా చేరుకుని హద్దు రాళ్లు తొలగించారు. ఈ మేరకు అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని చావా నాగేశ్వరరావు, రవి, గౌరమ్మ, సునీత, కిరణ్, మల్లయ్య, మహేశ్ తదితరులు కోరారు.



హద్దురాళ్లను తొలగిస్తున్న ప్లాట్ల యాజమానులు

విద్యుదాఘాతంతో రైతు మృతి

అధికారుల నిర్లక్ష్యమే కారణమని బంధువుల ఆందోళన



గూని ప్రసాద్ (ఫైల్)

చింతకాని: ఇటీవల ఈదురుగాలులకు తెగిపడిన విద్యుత్ తీగలను తాకిన రైతు షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు. అయితే, ఈ ప్రమాదానికి విద్యుత్ అధికారుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపిస్తూ ఆయన బంధువులు సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళకు దిగారు. వివరాలిలా ఉన్నాయి. రెండు రోజుల కిందట వచ్చిన ఈదురుగాలులకు మండలంలోని లచ్చగూడెంకు చెందిన రైతు గూని ప్రసాద్ (57) సోదరుడి పొలంలోని భారీ వృక్షం నేలకూలడంతో విద్యుత్ తీగలు తెగి పొలంలో పడ్డాయి. ఈ విషయమై అధికారులకు తెలిపినా పట్టించుకోలేదని తెలుస్తోంది. దీంతో శనివారం ఉదయం తన సోదరుడి పొలంలో పురుగు మందు పిచికారీ చేసేందుకు వెళ్లిన ప్రసాద్ తెగిపడిన విద్యుత్ తీగలను తాకి విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమీపాన ఉన్న ఆయన సోదరులు గూని అప్పారావు, వెంకటేశ్వర్లు అప్రమత్తమై ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి సరఫరా నిలిపివేశారు. కాగా, విద్యుత్ తీగలు తెగి పడ్డాయని అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోకపోవడంతో ప్రసాద్ మృతి చెందాడని ఆరోపిస్తూ బంధువులు కొదుమూరు విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట మృతదేహంతో ఆందోళనకు దిగారు. తహసీల్దార్ కూరపాటి అనంతరాజు, వైరా సీఐ సాగర్, డీఈ రామారావు, ఏఈ వెంకన్న, ఎస్‌ఐ నాగుల్‌మీరా చేరుకుని కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కాగా, ప్రసాద్‌కు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉండగా.. ఆందోళనలో పెద్దసంఖ్యలో బంధువులు, గ్రామస్తులు పాల్గొనడంతో ఖమ్మం ఏసీపీ రమణారెడ్డి ఆధ్వర్యాన బందోబస్తు ఏర్పాటు చేశారు.



సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు

ఆటోడ్రైవర్ ఆత్మహత్య

బోనకల్: ఆర్థిక ఇబ్బందులు భరించలేక ఓ ఆటోడ్రైవర్ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండలంలోని చొప్పకట్లపాలెంనకు చెందిన అమరబోయిన పాపయ్య అలియాస్ దానయ్య (32) కొన్నాళ్లుగా ఆటోడ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో కుంగిపోయిన ఆయన ఇంట్లో ఎవరూ లేని సమయాన బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలున్నారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మధుబాబు తెలిపారు.



పాపయ్య (ఫైల్)

ఛత్తీస్‌గఢ్ మృత్యుకాండను ఖండించండి

- సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కమిటీ

ఖమ్మంమయూరిసెంటర్: ఛత్తీస్‌గఢ్‌లో కేంద్ర, రాష్ట్రాల పోలీసు బలగాలు 32 మందికి పైగా మావోయిస్టులను కాల్చిచంపడాన్ని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఖండిస్తోందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు పేర్కొన్నారు. నారాయణపూర్ - దంతెవాడ సరిహద్దు తులతులి అడవుల్లో మావోయిస్టులు సమావేశమయ్యారనే సమాచారంతో కూంబింగ్ చేసి కాల్చేయడం దుర్మార్గపు చర్య అని తెలిపారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించినట్లు కగార్ ఆపరేషన్‌లో భాగమే ఈ ఎన్‌కౌంటర్ అని స్పష్టమవుతోందని పేర్కొన్నారు. చట్టప్రకారం అరెస్టు చేయడానికి బదులు చంపేయడం రాజ్యాంగ వ్యతిరేక చర్యగా భావిస్తున్నామని తెలిపారు. రాజ్యం మూకుమ్మడి హత్యాకాండకు పూనుకోవడం సరికాదని ఆయన పేర్కొన్నారు.

చకచకా క్రిటికల్ కేర్ భవన నిర్మాణం



పెద్దాస్పత్రిలో నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ భవనం

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో క్రిటికల్ కేర్ భవన నిర్మాణ పనులు చకచకా కొనసాగుతున్నాయి. క్రిటికల్ కేర్ భవనానికి నేషనల్ హెల్త్ మిషన్ ద్వారా రూ.23.75 కోట్లు మంజూరయ్యాయి. ఇందుకోసం ఆస్పత్రి ఆవరణలో కార్డియాలజీ విభాగం ఎదుట స్థలాన్ని కేటాయించగా జీ ప్లస్-3గా భవన నిర్మాణం కొనసాగుతోంది. యాభై పడకలతో నిర్మించే క్రిటికల్ కేర్ అందుబాటులోకి వస్తే వైద్య సేవలు మరింత మెరుగుపడనున్నాయి.

మొక్కల పెంపకం అందరి బాధ్యత

పెనుబల్లి: మొక్కలు నాటి సంరక్షించడాన్ని అందరూ బాధ్యతగా భావించాలని పద్మశ్రీ అవార్డు గ్రహీత వనజీవి రామయ్య సూచించారు. పెనుబల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలను శనివారం సందర్శించిన ఆయన మొక్కలు నాటి మాట్లాడారు. మొక్కలే జనజీవనంలో కీలకమని చెప్పారు. ఈ విషయమై విద్యార్థులు అవగాహన పెంపొందించుకుని మిగతా వారికి వివరించాలని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌డీ యూసుఫ్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రత్నాకర్, అధ్యాపకులు ప్రవీణ్, తిరుమలయ్య, భాస్కర్‌రావు, శేషగిరిరావు, నాగేశ్వరరావు, దుర్గ తదితరులు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న వనజీవి రామయ్య, ప్రిన్సిపాల్, అధ్యాపకులు

చైన్ స్నాచర్ల హల్‌చల్

- ఖమ్మంలో ఒకేరోజు మూడు చోరీలు

ఖమ్మంక్రైం: జిల్లా కేంద్రంలో శుక్రవారం చైన్‌స్నాచర్లు హల్‌చల్ చేశారు. ఒకేరోజు మూడు చోట్ల మహిళల మెడలో నుంచి గొలుసులు లాక్కుని పారిపోయారు. ఇలాంటి ఘటనలు ఇటీవల అదుపులోకి వచ్చాయని భావిస్తుండగానే శుక్రవారం జరగడం గమనార్హం. ఖమ్మం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు చోట్ల, టూటౌన్ పరిధిలో ఒక చోట చోరీలు జరిగాయి. ఇందులో ఒక చోరీ ఏకంగా సీసీఎస్ పోలీస్ స్టేషన్‌కు కూత వేటు దూరంలో జరగడం, చోరీ అయిన ఆభరణాల విలువ రూ.5 లక్షలకు పైగానే ఉండడం గమనార్హం. దీంతో అప్రమత్తమైన పోలీసులు ఒకే వ్యక్తి చోరీలు చేశాడా, లేక ముఠా వచ్చిందా అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. అయితే, పోలీసులు గస్తీ పెంచకపోతే బతుకమ్మ, దసరా పండుగల వేళ మహిళలు బయటకు రావాలంటే భయపడే అవకాశముంది.



చోరీలకు పాల్పడిన వ్యక్తి (సీసీ ఫుటేజీ)

నిందితుడి చిత్రం విడుదల

వరుస చోరీలు జరగడంతో రంగంలోకి దిగిన పోలీసులు పలు ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఫుటేజీల ద్వారా నిందితుడిని గుర్తించారు. సీసీ ఫుటేజీలో నమోదైన నిందితుడిని చిత్రాన్ని విడుదల చేసిన పోలీసులు సదరు వ్యక్తి ఆచూకీ తెలిస్తే సమాచారం ఇవ్వాలని సూచించారు. ఖమ్మం ఏసీపీ(87126 59105), ఖమ్మం వన్ టౌన్ సీఐ(87126 59106), టు టౌన్ సీఐ(8726 59110), ఖానాపురం హవేలీ (87126 59119) నంబర్లకు సమాచారం తెలపాలని పేర్కొన్నారు.



షోరూంను ప్రారంభిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పక్కన షోరూం యజమానులు గుర్రం ఉమామహేశ్వరరావు, వాసు, మురళి, మేయర్ నీరజ తదితరులు

జీవీ మాల్ నూతన షోరూం ప్రారంభం

- షోరూంను ప్రారంభించిన మంత్రి తుమ్మల
- జ్యోతి ప్రజ్వలన చేసిన సినీనటి కీర్తి సురేశ్

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం నగరంలోని వైరారోడ్‌లో జీవీ మాల్ నూతన షోరూం శనివారం ప్రారంభమైంది. కుటుంబమంతటికీ కావాల్సిన సరికొత్త డిజైన్లలో వస్త్రాలు ఒకే చోట లభించేలా ఈ షోరూంను 45 వేల అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేశారు. ఈ మేరకు షోరూంను రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో హైదరాబాద్ తరువాత ఖమ్మం అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందని తెలిపారు. జీవీ మాల్ యాజమాన్యం ఏళ్లుగా వస్త్ర రంగంలో పేరుగాంచారని చెప్పారు. ఆ తర్వాత సినీ హీరోయిన్ కీర్తి సురేశ్ జ్యోతి ప్రజ్వలన చేయగా షోరూంల్లోని వివిధ విభాగాలను పరిశీలిస్తూ సందడి చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఖమ్మం తొలిసారిగా రావడం ఆనందంగా ఉందని తెలిపారు. ఇప్పటికే జీవీ మాల్ షోరూంలకు ప్రజల ఆదరణ లభిస్తోందని, కొత్త షోరూంను సైతం అదే స్థాయిలో ప్రజలు ఆదరిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. జీవీ మాల్ అధినేతలు గుర్రం ఉమామహేశ్వరరావు, గుర్రం వాసు, గుర్రం మురళి మాట్లాడుతూ.. నాణ్యత, విస్తారమైన రేంజ్, సరసమైన ధరలే తమ ఎదుగుదలకు సోపానాలని తెలిపారు. అపరిమితమైన శ్రేణి, అద్భుతమైన మోడళ్లు అన్ని వయస్సుల వారికి కావాల్సిన దుస్తులు, వస్త్రాలు లభిస్తాయని వెల్లడించారు. కేఎంసీ మేయర్ పునుకొల్లు నీరజ, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, భద్రాద్రి బ్యాంక్ చైర్మన్ చెరుకూరి కృష్ణమూర్తి, హాస్యనటులు హైపర్ ఆది, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న హీరోయిన్ కీర్తి సురేశ్

మెడిసిన్ విద్యార్థికి ఆర్థిక సాయం



శ్రీహర్షితకు ఆర్థిక సాయం అందిస్తున్న దాతలు



శ్రీహర్షితకు నగదు అందిస్తున్న క్లబ్ ప్రతినిధులు

వైరా: వైరా 17వ వార్డుకు చెందిన నిరుపేద విద్యార్థి పాసెం శ్రీహర్షిత వనపర్తి ప్రభుత్వ మెడికల్ కాలేజీని సీటు సాధించినా ఫీజు, ఇతర ఖర్చులకు ఇబ్బంది పడుతుండడంతో 'సాక్షి'లో రెండు రోజుల కిందట కథనం ప్రచురితమైంది. వైరాకు చెందిన ఎన్నారై కట్ట కిరణ్ రూ.25 వేలు, కట్ట శేఖర్ రూ.10 వేలను శనివారం ఆమెకు అందజేశారు. అలాగే, కెనరా బ్యాంకు ఖమ్మం సీనియర్ మేనేజర్ ఆర్.వెంకటేశ్ ఆమె ఇంటికి వెళ్లి కుటుంబ వివరాలు, మెడిసిన్ చదివేందుకు అయ్యే ఖర్చుపై ఆరా తీయగా, రెండు, మూడు రోజుల్లో అవసరమైన సాయం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముళ్లపాటి సీతారాములుతో పాటు కట్టా కృష్ణార్జున్‌రావు, వనమా విశ్వేశ్వరరావు, డాక్టర్ కాపా మురళీకృష్ణ, కట్ట శేఖర్, మద్దెల రవి, మోటపోతుల సురేష్, సూర్యదేవర శ్రీధర్, కట్ట నర్సింహారావు తదితరులున్నారు.

'లయన్స్'రూ.31 వేల ఆర్థిక సాయం

ఖమ్మంగాంధీచౌక్: ఎంబీబీఎస్ సీటు సాధించిన శ్రీహర్షితకు లయన్స్ క్లబ్ ఆఫ్ ఖమ్మం బాధ్యులు రూ.31 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఖమ్మం గుట్టలబజార్‌లోని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో ఈ నగదు అందజేయగా వారు కృతజ్ఞతలు తెలిపారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ బొల్లికొండ శ్రీనివాసరావు, గెల్లా శ్రీరాంతోపాటు మేళ్లచెరువు వెంకటేశ్వరరావు, డాక్టర్ డీపీసీ రావు, పాయల నాగేశ్వరరావు, విశ్వేశ్వరరావు, కృష్ణారెడ్డి, నాగేశ్వరరావు, సుబ్బారావు, గోవిందరావు, వెంకయ్య, శ్రీనివాసరావు, హన్మంతరావు, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ అమరవీరుల ఆశయాలను నెరవేరుస్తాం

ఖమ్మంమయూరిసెంటర్: 2019 అక్టోబర్ 5 నుంచి 55 రోజుల పాటు ఆర్టీసీలో కొనసాగిన సమ్మె సందర్భంగా అసువులు బాసిన కార్మికుల ఆశయాలను నెరవేరుస్తామని ఆర్టీసీ ఖమ్మం రీజియన్ జేఏసీ చైర్మన్ పిల్లి రమేశ్ తెలిపారు. ఖమ్మం డిపో జేఏసీ చైర్మన్ బేతంపూడి బుచ్చిబాబు ఆధ్వర్యాన శనివారం అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించగా రమేశ్ మాట్లాడారు. ఆర్టీసీ కార్మికుల హక్కులను గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కాలరాస్తే, మొక్కవోని ధైర్యంతో సమ్మె నిర్వహించినట్లు తెలిపారు. కాగా, ఆర్టీసీలో యూనియన్ల పునరుద్ధరణ, 2013 ఆర్పీఎస్ బాండ్ బకాయిల చెల్లింపు, 2017 వేతన సవరణ అలవెన్స్‌ల పెంపుపై ప్రస్తుత ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. జేఏసీ రీజియన్ కన్వీనర్ ఎల్‌ఆర్‌కే రావు మాట్లాడగా జేఏసీ బాధ్యులు గుడిబోయిన శ్రీనివాస్, బొల్లికొండ వెంకన్న, దామాల లాజర్, ఎ.వీరయ్య, పురుషోత్తమరావు, నారాయణ, బి.శ్రీనివాసరెడ్డి, రామకృష్ణ, తోటకూర శ్రీనివాసరావు, ఆకుతోట శ్రీనివాసరావు, ఎల్.లక్ష్మణ్‌రావు, ఎం.వెంకటేశ్వర్లు, నారాయణ, ఏఎస్ రావు, ఆదిలక్ష్మి, రజిని, రామలక్ష్మి, వీరన్న, చారి తదితరులు పాల్గొన్నారు.



అమరుల చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న ఉద్యోగులు, నాయకులు